ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ జరుపుకోవాలి

- ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా

విశ్వంభర, ఎల్బీనగర్ : ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఎమ్మెల్సీ దయానంద గుప్తా అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని రంజాన్ కిట్స్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొగ్గారపు శరత్ చంద్ర తో కలిసి రంజాన్ కిట్స్ ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ రంగా, రాంబాబు గుప్తా, తిరుమల్ రెడ్డి, టింకు, నరేందర్ రెడ్డి, వెంకటేష్ చారి, శ్రీకాంత్, వేణు, శివ, కిషన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ జర్నలిస్టు నగేష్ కు ఇబ్రహీంపట్నం సీఐ ఆర్థిక సహాయం

విశ్వంభర, ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిగ్ టివి రిపోర్టర్ ముచ్చర్ల నగేష్ ఇటీవల న్యూస్ కవరేజ్ కోసం వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన నాగేష్ పరిస్థితిని గూర్చి టియుడబ్ల్యూజే (హెచ్ 143) యూనియన్ నాయకుల విజ్ఞప్తి మేరకు పరిస్థితిని అర్థం చేసుకున్న ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి మానవ దృక్పథంతో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని లిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిపోర్టర్ నాగేష్ ను పరామర్శించి ఆయనకు 25,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, టీయూడబ్ల్యూజే (హెచ్ 143) నియోజకవర్గ అధ్యక్షులు సురమోని సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి చెరుకూరి రాజు, సురమోని బాబు, హనుమంతు సుదర్శన్, మొలుగు శ్రీను, కిషన్, గోవర్ధన్, సైదులు ఇతర యూనియన్ సభ్యులు పి.వెంకటేష్ పి.క్రాంతి, కుమార్ పాల్గొన్నారు.

విజయ కుమారికి సన్మానం

విశ్వంభర, బాగ్ లింగంపల్లి : భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తూ సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పి విజయ కుమారిని సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ఉప్పల శ్రీనివాస్ గుప్త

విశ్వంభర, సికింద్రాబాద్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని టి పీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆల్వాల్ మండల్ ఆధ్వర్యంలో మహిళా శక్తిని గౌరవిస్తూ మహిళా దినోత్సవ వేడుకలను హెచ్ఎంటి బతుకమ్మ పార్కు, హై టెన్షన్ లైన్ రోడ్డు ఆల్వాల్ లో ఘనంగా నిర్వహించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కుటుంబం నుంచి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పబ్బా చంద్రశేఖర్, ఉప్పల స్వప్న, అర్చన, చంద్రశేఖర్, పాలకుర్తి రజిని, మంచి కంటి రత్న, పాలకుర్తి నరేష్ కుమార్, గుమ్మడవెల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర కీలకం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్

కొదుమూరి నేతృత్వంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

విశ్వంభర, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ అన్నారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవా దళ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కోదుమూరి దయాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో సేవాదళ్‌కు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావాలను పెంపొందించే వేదికగా సేవాదళ్ నిలుస్తుందని అన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరగా ఉండే సంస్థగా సేవాదళ్ గుర్తింపు పొందిందని వివరించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు విజయవంతం కావడంలో సేవాదళ్ సభ్యులు చురుకుగా పనిచేయాలని సూచించారు. సేవాదళ్ బలోపేతానికి ప్రతి కార్యకర్త ముందుకు రావాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని సంస్థను మరింత బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు జె.బి.శౌరి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్. జె.కె.అహ్మద్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేసబోయిన నరసింహా రావు, సేవాదళ్ అశ్వారావుపేట నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ ఎండి ఫజల్, చంద్రుగోండ మండల అధ్యక్షులు బుంగ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్పీజీ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూడాలి

విశ్వంభర, ఏపీ బ్యూరో : గృహ వినియోగానికి సంబంధించిన వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆస్పత్రులు, స్కూళ్లు, దేవాలయాలకు ఇబ్బంది రాకుండా నిరంతర సరఫరా ఉండాలని సూచించారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్టుకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయం లోని ఆర్టీజీఎస్ నుంచి రాష్ట్రంలోని ఎల్పీజీ నిల్వలు, బుకింగ్, సరఫరా వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సమావేశానికి ఓఎన్జీసీతోపాటు భారత్ పెట్రోలియం, హిందుస్తాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ సహా గ్యాస్ సరఫరా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలోని ఎల్పీజీ నిల్వలు, సరఫరా వంటి అంశాలపై పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ప్రస్తుతం రాష్ట్రంలో 17,209 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ స్టాక్ అందుబాటులో ఉందని ఉన్నతాధికారులు సీఎంకి వివరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్ పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ సంస్థలకు చెందిన 1,154 ఏజెన్సీల నుంచి గ్యాస్ సరఫరా అవుతోందని అధికారుల వెల్లడించారు. ఎల్పీజీ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలి పోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతి వినియోగదారు నుంచి ఓటీపీ తీసుకునే విధానాన్ని అవలంభించడం ద్వారా డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు. హెచ్ పీసీఎల్ సంస్థ 90 శాతానికి పైగా ఓటీపీలతోనే గ్యాస్ సరఫరా చేస్తోందని ఆ తర్వాత స్థానాల్లో బీపీసీఎల్, ఐఓసీఎల్ ఉన్నాయని అధికారులు తెలిపారు.

టెక్నాలజీ ఉపయోగించి పని చేయాలి..

ఓటీపీల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా సమన్వయం చేసుకుంటూ ఆర్టీజీఎస్ నుంచి సాంకేతిక సాయాన్ని ఆయా గ్యాస్ సరఫరా కంపెనీలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు. గ్యాస్ డెలివరి విషయంలో సిలిండర్లు దుర్వినియోగం కాకుండా టెక్నాలజీని ఉపయోగించి పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరా విషయంలో సాధారణ పరిస్థితుల్లో ఒకటిన్నర రోజుల్లోనే డెలివరి జరిగేదని కానీ ఇప్పుడు రెండున్నర రోజులు పడుతుందని అధికారులు వెల్లడించారు. గతంతో పోల్చుకుంటే రీఫిల్ బుకింగ్ గడవు పెరిగిందని ఇలాంటి సమయంలో గతంలో మాదిరిగానే డెలివరిని ఒకటిన్నర రోజుల్లోనే అందించగలిగితే ప్రజల్లో గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన ఉండదని సూచించారు. ఎల్పీజీ సరఫరా విషయంలో ప్రజల్లోని ఆందోళనలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కొన్ని కీలక వ్యవస్థలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అన్న క్యాంటీన్లకు గ్యాస్ సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 సెంట్రల్లీ కిచెన్ల ద్వారా అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా జరుగుతోందని వాటికి ఎలాంటి ఇబ్బందుల్లేవని అధికారులు చెప్పారు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో మానిటర్ చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో పాటు ఆస్పత్రులు, స్కూళ్లు, దేవాలయాలు వంటి వాటిల్లో రోజు వారీ కార్యాకలాపాలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిరంతరం ఆయా శాఖలకు చెందిన అధికారులతో సంప్రదింపులు జరుపుతూ ఉండాలని ఆదేశించారు.

హోటళ్ల అసోసియేషన్లతో సంప్రదింపులు..

హాస్టళ్లు వంటి వాటిల్లో కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇక ఎల్పీజీ వినియోగం తగ్గించుకునేలా హోటళ్ల అసోసియేషన్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని సూచించారు. ఇప్పటికే హోటళ్ల అసోసియేషన్లకు చెందిన కొందరు ప్రతినిధులతో మాట్లాడుతున్నామని వాళ్లు ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామన్నారని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ఇక చిన్న చిన్న వ్యాపారులకు రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు పడకుండా వారి జీవనోపాధికి ఆటంకం కలగకుండా ఉండేలా కిరోసిన్ సరఫరా చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశంలో ప్రస్తావించారు. ఇక ఎల్పీజీ గ్యాస్ సరఫరాకు ప్రత్యామ్నాయ విధానాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. సంక్షోభ సమయంలోనే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచన చేసి వ్యవస్థలను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. యుద్ధం జరుగుతున్న సందర్భంలోనే కాకుండా యుద్ధ విరమణ తర్వాత కూడా కొన్ని రోజులు పాటు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు లేకపోలేదని వాటిని కూడా అంచనా వేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక ఓఎన్జీసీ, గెయిల్, బీజీఎల్ వంటి సంస్థలతో ఇంటింటికి గ్యాస్ పైప్ లైన్ కనెక్షన్లు ఇచ్చే సంస్థలు సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఈ క్రమంలో గ్యాస్ పైప్ లైన్ల విస్తరణకు అవసరమైన చర్యలపై దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. ఇండక్షన్ స్టవ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు.ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు త్వరలోనే మరింత ఎల్పీజీ కేటాయింపులను కేంద్రం చేయనున్నట్టు అధికారులు సీఎం వెల్లడించారు. వివిధ ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యల పైనా అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పంజాల శోభరాణి, శ్రీనివాస్‌గౌడ్ దంపతుల కూతురు శివసాయిశ్రీ-సంప్రీత్‌గడ్ విందుకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, కాచం సుష్మ, డా. కాచం నిఖిత.

సింగిల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపికలో లోపించిన పారదర్శకత

అనర్హులకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం

దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి: కొండ హరీష్ గౌడ్.

విశ్వంభర, హుజూర్ నగర్ : భారతీయ జనతా పార్టీ హుజూర్ నగర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలందరికీ కూడా ఇళ్లను మంజూరు చేయాలి అని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ.. హుజూర్ నగర్ పట్టణంలో రామస్వామి గట్టు వద్ద శ్రీ సీతారామచంద్రస్వామి మోడల్ కాలనీ పేరుతో నిర్మిస్తున్నటువంటి ఇళ్లలో ప్రభుత్వం వారు 805 మంది లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో అనర్హులకు అనగా ఆస్తులు ఉన్నవారికి, వేరే చోట ఇండ్లు, ఇళ్ల స్థలాలు, పొలాలు ఉన్నవారికి, స్థానికంగా లేనివారికి, వ్యాపారస్తులకు పెద్దపీట వేశారని, నిజమైన ఇండ్లు లేని రోడ్డు మీద, సంవత్సరాల నుంచి కిరాయి ఇండ్లలో ఉంటూ కిరాయిలు కట్టుకుంటూ ఉండే కుటుంబాలకు అన్యాయం చేశారని తెలిపారు. అదేవిధంగా ప్రకటించిన జాబితాలో పూర్తిస్థాయిలో అవకతవకలు జరిగాయని వారికి అవకాశం ఉన్నవారికి వారికి, అవసరం పడే వారికి మాత్రమే జాబితాలో చోటు కల్పించారని, పూర్తిస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం వహించి క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేనటువంటి వారిపై ఆధారపడి ఈ విధంగా జాబితాను రూపొందించారని దీనిని వెంటనే సవరించాలని ఆక్షేపించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ప్రతి సారి ఈ ఇండ్ల ఎంపికలో పూర్తిస్థాయి పారదర్శకత ఉంటుందని, ఇందులో ఎవరి ప్రలోభాలకు గురి కావొద్దని మేము అధికారులకు చెబుతున్నామని చెబుతున్నారు మరి ఇదేనా వారి యొక్క నిబద్ధత, ఇదేనా వారి యొక్క పారదర్శకత అని ప్రశ్నించారు. అయ్యా ఉత్తం కుమార్ రెడ్డి గారు మీరు మీ యొక్క సొంత టీం తోటి ఈ ప్రకటించిన జాబితా మీద మీరే ఒకసారి పరిశీలన చేయించుకోండి, మీకే అసలు వాస్తవాలు తెలుస్తాయని హితవుపలికారు. అదేవిధంగా ఆర్డీవో గారితో మాట్లాడుతూ ఈ యొక్క జాబితాను సవరించి నిజమైన అర్హులకు ఇళ్ళను కేటాయించే విధంగా ప్రయత్నం చేయాలని మళ్ళీ ఒకసారి మీ సొంత పర్యవేక్షణలో ఎంక్వయిరీని నిర్వహించాలని వారిని కోరారు. ఈ యొక్క ఇండ్ల ఎంపికలో గనక అర్హులకు కాకుండా అనర్హులకు ఇదేవిధంగా వారు ఇండ్లను ప్రకటించితే బీజేపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో బాధిత ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు బెల్లంకొండ నరేష్ గౌడ్, సోమగాని ప్రదీప్, కంటు నాగరాజు, పిల్లి నాగేశ్వరరావు, కొప్పెర సాయిరాం, పైడిమర్రి విజయ్, మురళి, పులి నరసింహారావు, చుక్క హరిష్ వీరితోపాటు బాధితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు హైదరాబాద్ సిద్ధం: డీజీపీ శివధర్ రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : హైదరాబాద్ వేదికగా ప్రతిష్ఠాత్మకమైన 74వ బీ.ఎన్. మల్లిక్ మెమోరియల్ అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరగనున్న ఈ క్రీడా సంబరానికి తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు డీజీపీ తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు 46 జట్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో ప్రదర్శించనున్న ప్రత్యేక లోగోలను ఖరారు చేశారు. ఈ టోర్నీలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ బలగాల నుంచి క్రీడాకారులు తరలివస్తున్నారని పేర్కొన్నారు. ఈ మెగా టోర్నీ కోసం నగరంలోని ఆరు ప్రధాన మైదానాలను సిద్ధం చేశామని, గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, అజీజ్ నగర్‌లోని హెచ్ఎఫ్సీ గొగ్జీస్ స్పోర్ట్స్ ఎరీనా, మొయినాబాద్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ గ్రౌండ్, శివరాంపల్లిలోని జాతీయ పోలీస్ అకాడమీ మైదానం, గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్ గ్రౌండ్, తెలంగాణ పోలీస్ అకాడమీ మైదానాలు ఉన్నాయని తెలిపారు. గచ్చిబౌలి, హెచ్ఎఫ్సీ మైదానాల్లో రాత్రి సమయాల్లోనూ మ్యాచ్‌లు నిర్వహించేందుకు వీలుగా ఫ్లడ్ లైట్ల సౌకర్యం ఉందని డీజీపీ తెలిపారు. మార్చి 24న టీమ్ మేనేజర్‌ల సమావేశం డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించి, 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభ వేడుకలను నిర్వహిస్తామని, తొలి మ్యాచ్ లో తెలంగాణ పోలీస్ జట్టు ఆడుతుందని వెల్లడించారు. పోటీల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఒక ఐపీఎస్ అధికారితో పాటు 13 మంది డీఎస్పీ/అసిస్టెంట్ కమాండెంట్ స్థాయి అధికారులు, 23 మంది ఇన్‌స్పెక్టర్లు, 35 మంది టీమ్ మేనేజర్లు పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 5న ముగింపు వేడుకలతో ఈ క్రీడా సంబరం ముగుస్తుందని వివరించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇప్పటి వరకు పురుషుల విభాగంలో 37 జట్లు, మహిళల విభాగంలో 9 జట్లు ముందుకు వచ్చాయని డీజీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, అడిషనల్ డీజీపీలు మహేశ్ ఎం. భగవత్, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ల కింద క్రీడా మైదానాలు యువతకు ఎంతో ఉపయోగం : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో గల ఫ్లై ఓవర్ల కింద క్రీడా మైదానాలతో స్థానిక యువతకు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆలేఖ్య టవర్స్ నుంచి ఎల్.బి.నగర్ ఫ్లై ఓవర్ల క్రింద నూతనంగా నిర్మించిన క్రీడా మైదానాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో, ఫ్లైఓవర్ల క్రింద ఉన్న స్థలం వృథా కాకుండా చిన్నారులు, యువత , సీనియర్ సిటిజన్ల కోసం ఆట మైదానాలు, వాకింగ్ ట్రాక్‌లు, సేదతీరడానికి బల్లలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం జరిగిందని, ఈ విషయాన్ని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, వారు వెంటనే స్పందించి ఫ్లైఓవర్ల క్రింద క్రీడా మైదానాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు అని అన్నారు. ఎల్.బి.నగర్ కామినేని హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ క్రింద నాసా గుర్తించిన కొన్ని వేల మొక్కలతో ఒక అద్భుతమైన ఆక్సిజన్ పార్క్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం అక్కడ ఎంతో మంది ప్రజలు కాలుష్యం లేని స్వచ్ఛమైన వాతావరణంలో వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

అక్షరా ది స్కూల్‌లో 'యంగ్ ఇన్నోవేటర్స్ ఫెయిర్'

విశ్వంభర, ఎల్బీనగర్ : అక్షరా ది స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'యంగ్ ఇన్నోవేటర్స్ ఫెయిర్' కార్యక్రమం విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలు, శాస్త్రీయ ప్రయోగాలతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవ దశలో ముందుకు సాగుతోందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ వంటి రంగాలు ప్రపంచాన్ని కొత్త దిశగా తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ ఇప్పటికీ ఎక్కువగా పరీక్షలు, మార్కులు, ఉద్యోగాల చుట్టూ తిరుగుతోందని విమర్శించారు.విద్యార్థులను కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దే విద్య అవసరం. ప్రశ్నించే ధైర్యం, విఫలమయ్యే ధైర్యం, మళ్లీ ప్రయత్నించే పట్టుదల ఉంటేనే నిజమైన ఆవిష్కర్తలు తయారవుతారు" అని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరియు సాధారణ కుటుంబాల్లో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ అవకాశాల కొరత కారణంగా చాలా ఆలోచనలు వెలుగులోకి రావడం లేదని గుజ్జ సత్యం అభిప్రాయపడ్డారు. విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి అవకాశాలు లభించాలి అని ఆయన సూచించారు. ప్రొఫెసర్, ఏఐసీసీ బీసీ సెల్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ గొప్ప ఆవిష్కరణలన్నీ "ఎందుకు?" అనే చిన్న ప్రశ్నతోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు పుస్తకాలతో పాటు ప్రయోగాల ద్వారా నేర్చుకోవాలని, ప్రయోగాత్మక విద్య భవిష్యత్తు పరిశోధనలకు పునాది వేస్తుందని అన్నారు. బిజెపి బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ప్రతిభకు వేదికగా నిలుస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలు మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే వారు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ జిల్లా వెంకటేశం, డైరెక్టర్లు అరవింద్ బాబు, పద్మ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బహదూర్పుర డిప్యూటీ ఈవో గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుమన్ ని మర్యాదగాపూర్వకంగా కలిసిన ప్రభుత్వ బాలుర అందుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు సద్గుణ, శ్రీనివాస్ రెడ్డి తమీజ్ అహ్మద్.
(విశ్వంభర, చార్మినార్)